మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న కలెక్టర్, జెసి

కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తత

• గేట్లు ఎక్కి లోపలికి వెళ్లేందుకు యత్నం • జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేత • ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పై నిరసన

కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు ముందుగానే గేట్లు ఎక్కకుండా కంచెను ఏర్పాటు చేసినప్పటికీ తొలగించుకుని గేట్లుఎక్కి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో వెంటనే పోలీసులు వారిని నిలువరించారు. కొంతసేపు పోలీసులకు ఎస్ఎఫ్ఐ నాయకులు మధ్య వాగ్వాదం తోపులాట కొనసాగింది. అక్కడ ఉన్న మూడో పట్టణ సిఐ వెంటనే ఉన్నతాధికారులకు సమాచారాన్ని చేరవేశారు. అక్కడికి కలెక్టరేట్ ఎఒ శివ రాముడు వచ్చి సమస్యలను విన్నవించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరినప్పటికీ ససేమీరా అన్నారు. జిల్లా కలెక్టర్ నేరుగా ఇక్కడికి వచ్చి తమ ఆందోళనకు సంబంధించిన వినతి పత్రాన్ని స్వీకరిస్తేనే ఆందోళన విరమిస్తామని ఎఒకు తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా దష్టికి తీసుకువెళ్లగా ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులను తన దగ్గరకు తీసుకురావాలని పోలీసులను ఆదేశించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌ను కలిసి అనేక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సమస్యలన్నిటిని రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృ షి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సాయి ఉదయ్, రంగప్ప మాట్లాడుతూ జిల్లాలో ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆదోని మెడికల్ కాలేజీని నిర్మాణం త్వరగా పూర్తి చేసి ప్రభుత్వమే అడ్మిషన్స్ నిర్వహించాలన్నారు. కర్నూలులోని కెవిఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు హాస్టల్ వసతిని కల్పించాలన్నారు. ఎమ్మిగనూరులో ప్రభుత్వ బిసి ప్రీమెట్రిక్ సంక్షేమ వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఆలూరులో ప్రభుత్వ బాలికల బిసి ప్రీమెట్రిక్ సంక్షేమ వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పెండింగులో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయి రూ.6,400 కోట్ల తక్షణమే విడుదల చేస్తామని హామీ ఇప్పటివరకు ఒక్క పైసా కూడా విడుదల చేయలేదన్నారు. జిల్లాలో దాదాపుగా 2వేల మంది విద్యార్థులు పైబడి బిసి,ఎసి, ఎస్‌టి, మైనారిటీ వర్గాల సంబంధించిన విద్యార్థులు సంక్షేమ హాస్టల్స్‌లో విద్యనభ్యసిస్తున్నారు హాస్టల్స్ నిర్వహణ చాలా దౌర్భాగ్యంగా ఉందన్నారు. సంక్షేమ హాస్టల్స్ శిథిలావస్థకు చేరుకున్నాయని, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. విద్యార్థులకు అవసరమైన ట్రంకు పెట్టెలు, బెడ్ షీట్లు, దోమతెరలు ఇతర అవసరమైన వస్తువులు ప్రభుత్వం సరఫరా చేయలేదన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో సిఎం క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, అంజి, విజయ్, అమర్ జిల్లా సహాయ కార్యదర్శిలు అబు బకర్, లక్ష్మీనారాయణ జిల్లా కమిటీ సభ్యులు రాము, ఆర్యన్, సంజయ్, విల్సన్, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు భాస్కర్, యోగి, చరణ్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మట్టి వినాయకులను ప్రతిష్టించాలి

- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడుదామనిజిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణహితం మట్టి వినాయకులను జిల్లా కలెక్టర్ ఉచితంగా పంపిణీ చేశారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తయారు చేసిన 800 మట్టి వినాయకుల విగ్రహాలను జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్ఒ , పిజిఆర్ఎస్‌కు వచ్చిన ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందన

కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో జార్ఖండ్‌లో జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రెండోవ, మూడవ, నాల్గవ స్థానాలు సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ అభినందించి సర్టిఫికెట్లు అందచేశారు. పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కర్నూలు జిల్లాకు చెందిన ఎస్ఎండి వలి, కౌశిక్, ఆరిఫ్ బాష, టి.ప్రణీత, జె.సాయి పల్లవి, అనిత, ఎం.శ్రావణి లు పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రెండోవ, మూడవ, నాల్గవ స్థానాలు సాధించినందుకు కలెక్టర్ అభినందించారు... కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్ఒ సి.వెంకటనారాయణమ్మ, పవర్ లిఫ్టింగ్ సెక్రటరీ లోకేష్, అదనపు సెక్రటరీ వేణుగోపాల్, జాయింట్ సెక్రెటరీ రేష్మ పాల్గొన్నారు

గ్రీవెన్స్ పట్ల అలసత్వం తగదు

బాధితులు ఇచ్చే గ్రీవెన్స్ పట్ల అలసత్వం తగదని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యలు పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య బాధితుల నుండి వినతులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పిజిఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డిఆర్ఒ సి.వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి

మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర నాయకులు సురేష్, తదితరులు

జెవివి జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా సుధీర్ రాజు, ఖాజా హుస్సేన్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జన విజ్ఞాన వేదిక జిల్లా నూతన కమిటీ ఎన్నికయిందని, రాష్ట్ర నాయకులు సురేష్ తెలిపారు. నూతన జిల్లా కమిటీకి అధ్యక్ష కార్యదర్శులు బీడీ సుధీర్ రాజు, ఖాజా హుస్సేన్, జిల్లా గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ భరత్, ధనుంజయ, న్యాయవాది మురళి సలహాదారులుగా జిల్లా వినియోగదారుల కమిషన్ బోర్డు మెంబర్ , న్యాయవాది నారాయణరెడ్డి, జంధ్యాల రఘుబాబు, డాక్టర్ రామ్ గోపాల్, కోశాధికారిగా వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులుగా జయరాజు, డాక్టర్ కె.బడే సాహెబ్, శంకరయ్యలను ఎన్నికయ్యారు. సమతా విభాగం కన్వీనర్ గా రమాదేవిని ఎన్నుకున్నారు.

వీరితోపాటు 16 మందిని ఎగ్జిక్యూటివ్ నెంబర్లుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుధీర్ రాజు, ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ జిల్లాలో సైన్స్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

అన్ని విధాలుగా నగరాభివృద్ధి

• సర్వసభ్య సమావేశంలో మేయర్ రామయ్య
• రూ.4.06 కోట్లు విలువైన అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగర ప్రజల భాగస్వామ్యంతో కర్నూలును అన్ని విధాలా అభివృద్ధి చేద్దామని నగర మేయర్ బివై. రామయ్య అన్నారు. ఈ నెల 2న అనివార్య కారణాల వల్ల వాయిదా పడిన సర్వసభ్య సమావేశాన్ని తిరిగి సోమవారం నిర్వహించారు. నగరపాలక సమావేశ భవనంలో మేయర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, కమిషనర్ పి.విశ్వనాథ్, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు హాజరయ్యారు. మొత్తం 15 తీర్మానాలను ఆమోదించారు. రూ.4.06 కోట్ల విలువ గల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు. నగరంలో రహదారులు, డ్రైనేజీ, పార్కులు, పైప్‌లైన్లు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి పలు తీర్మానాలను ఆమోదించారు. అనంతరం జోన్ల ఏర్పాటు, వీధి దీపాల ఏర్పాటు, వీధిశునకాల బెడద నివారణ, శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడం, పారిశుధ్య మున్సిపల్ పార్కింగ్ ప్రదేశాల్లో వ్యాపారాల నిషేధం, వినాయకచవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమాల వద్ద స్వచ్ఛత పనుల కోసం యాక్షన్ ప్లాన్ వంటి అంశాలపై చర్చించారు. వార్డుల్లో కార్పొరేటర్లు లేవనెత్తిన సమస్యలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి మాట్లాడుతూ.. ఎన్‌హెచ్-340సి రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. వెంచర్లలో మౌలిక వసతులు కల్పించని రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కల్లూరు పరిధిలో నుంచే ఆదాయం ఎక్కువగా వస్తున్నప్పటికీ సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని తెలిపారు. వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు చేపట్టబోతున్నామని, వినాయకచవితి సందర్భంగా అన్నదాన కార్యక్రమాల వద్ద స్వచ్ఛత కోసం ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తామని తెలిపారు. కార్పొరేటర్లు లేవనెత్తిన అంశాలను పరిష్కరిస్తామని, నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారం తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఇ శేషసాయి, ఎంఇ మనోహర్ రెడ్డి, ఆర్ఒలు జునైద్, ఇశ్రాయేల్, వాజిద్, టీపీఆర్ఓ శ్రీనివాసులు, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, ఎగ్జామినర్ సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి

మాట్లాడుతున్న మేయర్ బివి.రామయ్య

కోడుమూరు ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న పిఎల్ వరలక్ష్మి

ఎరువుల దుకాణాలను తనిఖీ

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : జిల్లా వ్యవసాయ అధికారిని పిఎల్. వరలక్ష్మి

ప్రజాశక్తి- కోడుమూరు

కోడుమూరు మండల కేంద్రంలోని రసాయనిక ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారిని పిఎల్. వరలక్ష్మి , మండల వ్యవసాయ అధికారులు కోడుమూరు, గూడూరు యూరియా స్టాకులను పరిశీలించారు. విజయలక్ష్మి ఫర్టిలైజర్స్ , ఉరుకుంద రైతు డిపోలలో తనిఖీలు చేశారు. విజయలక్ష్మి ఫర్టిలైజర్స్‌లో యూరియా నిలువలు ,ఈపాస్ మిషన్ బ్యాలెన్స్ సరిగా ఉండడంతో వారిదుకాణంలో ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఉరుకుంద రైతు డిపోలో ఈపాస్ మిషన్ బ్యాలెన్స్‌కు ఫిజికల్ బ్యాలెన్స్‌కు తేడా ఉండడంతో స్టాప్‌సేల్ అనగా అమ్మకాల నిలుపుదల చేసి యూరియాకు డిఎపికి ఇచ్చారు. 27 మెట్రో టన్నులు దాదాపు 600 బస్తాలకు అమ్మకాల నిలుపుదల చేశామన్నారు. దీనితో పాటుగా డిఎపి 70 బస్తాలు అనగా 3.5 మెట్రిక్ టన్నులు అమ్మకాలు నిలిపేశారు. ఉరుకుందా రైతు డిపోలో స్టాక్ బోర్డు ప్రైస్ బోర్డు పొందపరచకుండా ఉంచుతూ బిల్స్‌లో రైతుల సంతకాలు లేనందున జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాలతో కర్నూలు ఎడిఎ రైతు డిపోకు శోకాజ్ నోటీస్ ఇచ్చారు. ఈ షోకాస్ నోటీస్ ముట్టాక మూడు పని దినాలలో వివరణ ఇవ్వాలన్నారు. రిప్లయ్ ఆధారంగా వారి మీద చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానిక అధికారులు విజయలక్ష్మి, ఫర్టిలైజర్స్ యజమాని ప్రవీణ్ కుమార్ రెడ్డి , ఉరుకుంద రైతు డిపో యజమాని శ్రీరాములు పాల్గొన్నారు.



మెడిషన్‌సీట్లు సాధించిన విద్యార్థులతో ఎక్సెల్ డైరెక్టర్లు, అధ్యాపకులు

ఎంబిబిఎస్ మొదటి విడతలోఎక్సెల్ ప్రభంజనం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మొదటి విడుత సీట్ల కేటాయింపులో 16 మంది విద్యార్థులకు ఎంబిబిఎస్ సీట్లు కేటాయించరారని ఎక్సెల్ అకాడమీ డైరెక్టర్స్ టి.చంద్ర శేఖర్, టి.రాఘవేంద్ర, టి.గోపినాథ్ తెలియజేసారు. ఈ సందర్భంగా సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈకార్యక్రమంలో అకాడమీ హెడ్స్ ఇఎస్.భోగేంద్రనాథ్‌రెడ్డి, బి.సుంకన్న, సి.సుంకన్న, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సోదర భావంతో పండుగలను జరుపుకోవాలి

-సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మొద్దు
-సమస్యలుంటే పోలీసుల దృష్టికి తేవాలి
-శాంతి సమావేశంలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

-పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడున్న ఎస్‌పి పాటిల్

ప్రజలందరూ కలిసిమెలిసి సోదర భావంతో పండుగలను నిర్వహించుకోవాలని కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంతు పాటిల్ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఈ నెల 27న వినాయక చవితి పండుగ, సెప్టెంబర్ 4 న వినాయక నిమజ్జనం పండుగలను పురస్కరించుకుని పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. నగరంలోని వివిధ వర్గాలకు చెందిన సామాజిక మత పెద్దలతో జిల్లా ఎస్‌పి మాట్లాడారు. ముందస్తుగా జిల్లా ప్రజలందరికి వినాయక చవితి పండుగ తెలియజేస్తున్నామన్నారు. ముఖ్యమైన వినాయక విగ్రహాల వద్ద తాత్కలిక సిసి కెమెరాలను అమర్చుకునే విధంగా చూడాలన్నారు. ఖచ్చితంగా రాత్రివేళల్లో విగ్రహాల వద్ద ఒకరు కాపాలా ఉండే విధంగా ఉత్సవ కమిటి సభ్యులు చూడాలన్నారు. సిసికెమెరాలతోనే నేర నివారణ సాధ్యమవుతుందన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా అందరూ సహకరించాలన్నారు. ఇబ్బందులు కలిగించరాదన్నారు. పోలీసుల నిబంధలు పాటించాలన్నారు. కర్నూలు మతసామరస్యానికి స్ఫూర్తిగా నిలిచిందని కుల,మతాలకు అతీతంగా ప్రశాంతమైన వాతావరణంలో కలిసి మెలిసి పండుగలు జరుపుకోవాలన్నారు. పుకార్లు, వదంతలను ప్రచారం చేయకూడదన్నారు, నమ్మవద్దన్నారు. అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ హుస్సేన్ పీరా , కర్నూల్ డిఎస్‌పి బాబుప్రసాద్, సిఐలు తేజమూర్తి, కేశవరెడ్డి, పార్థసారథి, విక్రమసింహా, నాగరాజా రావు, తబ్రేజ్, గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు, మత పెద్దలు, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ అబ్దుల్ సలాం, గణేష్ ఉత్సవ కమిటి అధ్యక్షుడు వేణుగోపాల్, గోరంట్ల రమణ, మౌలానా అబ్దుల్ ఖదీర్, మిలాద్ కమిటి అధ్యక్షుడు మౌలానా సయ్యద్ షఫీ భాషా ఖాద్రి, జామియా మసీధు ధర్మకర్త భాసుమియా, టిడిపి మైనారిటీ లీడర్ షమిబాషా, ప్రతాపరెడ్డి , పూల రంగస్వామి, మద్దిలేటి, జోగయ్యశర్మ, అబ్దుల్ రజాక్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా సారథి పై తర్జనభర్జన

నేడు త్రీ మెన్ కమిటీ జిల్లాకు రాక -సభ్యులతో అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

జిల్లాలో ప్రస్తుతం టిడిపి జిల్లా అధ్యక్ష పదవిపై చర్చ జోరుగా నడుస్తోంది. టిడిపి అధిష్టానం జిల్లాలలో పార్టీ బలోపేతానికి నడుం బిగించిన నేపథ్యంలో జిల్లాల వారీగా అధ్యక్ష పదవుల మార్పులు చేర్పుల అంశంపై దృష్టి సారించిందని తెలుస్తోంది. గత సంస్థాగత ఎన్నికల్లో పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ సారథ్యంలో రచించిన ఎన్నికల ప్రణాళిక పథకం విజయవంతమైంది. అందులో భాగంగా జిల్లాలో 11 ఎమ్మెల్యే స్థానాలుతో పాటు రెండు ఎంపి ఉమ్మడి జిల్లాల స్థానాలను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. నూతన ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి దాదాపు 14 నెలలు పాలనను విజయవంతం గా పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జిల్లా పార్టీ రథసారథులను నియమించే ప్రక్రియకు పార్టీ శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఆ బాధ్యతలు నిర్వహిస్తున్న పాలకుర్తి తిక్కరెడ్డి స్థానం పదిలంగా ఉంటుందా లేదా అన్న అంశంపై చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీలో పలువురు నాయకులు సైతం ఆ పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఎవరికి వారు తమఆకాంక్షను నెరవేర్చుకోవడానికి ప్రయత్నాలను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా అధ్యక్ష పదవి రేసులో ఎస్‌పి ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఆకెపోగు ప్రభాకర్, నగర అధ్యక్షులు నాగరాజుయాదవ్, రాష్ట్ర నాయకురాలు అరుణమ్మ, టిఎన్‌టియుసి నాయకులు అశోక్‌కుమార్, జిల్లా టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు కెఇ.జగదీష్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు పోటీ పడుతున్నట్లు వినికిడి ఉంది.

నేడు త్రిసభ్య కమిటీ జిల్లాకు రాక

టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు జిల్లాలో నూతన అధ్యక్షుని నియామక పరిశీలన కోసం మంగళవారం త్రిసభ్య కమిటీ జిల్లాలో పర్యటించనుంది. సభ్యులుగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎంపీలు ఎమ్మెల్యేలు పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలు సేకరించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధ్యక్ష పగ్గాలు ఎవరి చేతికి లభించనున్నాయో వేచి చూడాల్సిందే.

జాతీయ నేత్రదాన పక్షోత్సవాలపై డిఎంహెచ్ఒ సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయములో డిఎంహెచ్ఒ డాక్టర్ పి.శాంతికళ సోమవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాల గురించి ప్రోగ్రాం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగష్టు 25 నుండి సెప్టెంబర్ 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలను జరుపుతున్న సందర్భంగా ప్రోగ్రాం అధికారులకు కేటాయించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. తదుపరి జిల్లాలో అమలు అవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పర్యవేక్షించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పథకాలను వందశాతం విజయవంతం చేయాలని సూచించినారు. సంక్రమిత, అసంక్రమిత చికిత్సల వ్యాధుల నిర్ధారణ చేయించి తగు చికిత్సలు అందే విధంగా చూడాలని తెలిపారు. పట్టణ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో క్షేత్ర స్థాయిలోని సిబ్బంది సంబంధిత పోర్టల్‌లో యాప్‌లలో డేటా అప్లోడ్ చేసే విధంగా చూడాలని తెలిపారు. ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వి వెంకటేశ్వర్లు, డిఎల్ఎటిఒ డాక్టర్ ఎల్. భాస్కర్, ప్రాంతీయ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సత్య నారాయణ, డాక్టర్ పెంచలయ్య , డిపిఎంఒ డాక్టర్ ఉమా, డాక్టర్ సంధ్య రెడ్డి, పిఒ ఆర్ బిఎస్ కె.డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్ , సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు , డిఎంఒ నూకరాజు, డిపిఒ విజయరాజు, డెమో శ్రీనివాసుల శెట్టి లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎంహెఒ డాక్టర్ శాంతికళ

విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ, శౌరీల్‌రెడ్డి

నైతిక విలువలు పెంపొందించుకోవాలి

ప్రముఖ గ్యాస్ట్రో అంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులునైతిక విలువలు పెంపొందించుకోవాలని ప్రముఖగ్యాస్ట్రో ఇంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. సోమవారం కర్నూలులోని సెయింట్ జోసెఫ్ ఇంటర్ జూనియర్ కాలేజీలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన ఫోటోలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఎలా గువ్వవేరా అధ్యక్షత జరిగిన సభలో డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ నేడు విద్యార్థులు సెల్ ఫోన్‌కు,సోషల్ మీడియాకు బానిసలుగా మారి తమ విలువైన సమయాన్ని వృధా చేసుకుంటున్నారని అన్నారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవాలని కోరారు. కళాశాలల డీన్ శౌరిల్ రెడ్డి మాట్లాడుతూ వామపక్ష సాహిత్యాన్ని, నిజమైన వార్తలను నిర్భయంగా ప్రచురించే పత్రికలకు ఆదరణ తగ్గదన్నారు. విద్యార్థులు పత్రికా పఠనం అలవర్చుకోవాలన్నారు. సామాజిక సేవలో విద్యార్థులు పాలు పంచుకోవాలని కోరారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకులు ధనుంజయ, ఇంటర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శాంత , భాను ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మించాలి

కలెక్టర్‌కు పిపిఎస్ఎస్ నాయకుల వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జి పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని టిజి. నగర్ కాలనీలో అనాథ పిల్లల ఆశ్రమం దగ్గర ప్రమాదాలు జరగకుండా సిసిరోడ్డు నిర్మించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇ పుల్లారెడ్డి, స్థానికులతో కలిసి జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను కోరారు. సోమవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, స్థానిక కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు జె. వెంక్రిస్వామి, జి.హర్షవర్ధన్ రెడ్డి, ఇ.రాజేశ్వరి, ఎం.బాలమ్మ మాట్లాడారు. జి పుల్లారెడ్డి కాలేజీ సమీపంలోని రోడ్డుకు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. అనాథ పిల్లల ఆశ్రమం, వికలాంగుల పిల్లల స్కూలు, టిజి.కాలనీ మీదుగా ఆర్‌టిఒ ఆఫీస్, జగన్నాథం గట్టు శివాలయం వెళ్లే ఈ రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉం టుందన్నారు. వెం టనే సిసి రోడ్డు నిర్మాణానికి చ ర్యలు తీసు కోవా లని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పండగలను శాంతియుతంగా జరుపుకోవాలి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి - ఆదోని

పండగలను శాంతియుత వాతావరణంలో, సోదరభావంతో నిర్వహించుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం ఆదోని మున్సిపల్ కార్యాలయం సమావేశం మందిరంలో డీఎస్పీ హేమలత అధ్యక్షతన ఇరు మతాల పెద్దలతో సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఈనెల 27న వినాయక చవితి పండగ సందర్భంగా ప్రజలకు ఇబ్బందికరంగా లేని ప్రాంతాల్లో వినాయకు విగ్రహాలను ప్రతిష్ఠించాలని తెలిపారు. 31న గణేష్ నిమజ్జనం శోభాయాత్ర ఉదయం పూటనే మొదలు పెట్టాలని చెప్పారు. కొందరు ఆలస్యంగా విగ్రహాలు తరలించడం వల్ల రాత్రివేళలో సమస్యలు తలెత్తుతాయని, నిమజ్జనం జరిగే చోట ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. పగటి పూటనే నిర్వహిస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుందన్నారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు చొరవ తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ హుస్సేన్ పీరా, రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి, పెద్దలు ప్రతాప్ స్వామి, దేవిశెట్టి ప్రకాష్, షఫీ అహ్మద్, జునైద్, బసవన్న గౌడ్, విట్టా రమేష్, నీలకంఠ ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రజాశక్తి ముందంజ

- ఎమ్మెల్యే విరుపాక్షి, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

ప్రత్యేక అనుబంధాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి

మారుమూల ప్రాంతాల్లో, పట్టణాల్లో ప్రజా సమస్యలుంటే వాటిని వెలికి తీయడంలో ప్రజాశక్తి ముందుంటుందని ఎమ్మెల్యే బి.విరుపాక్షి, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ తెలిపారు. సోమవారం చిప్పగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధాన్ని విరుపాక్షి, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజా సమస్యలను ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు తెలపడంలో ప్రజాశక్తి పత్రిక మంచి కృషి చేస్తోందని చెప్పారు. అందుకు ప్రజాశక్తి సంపాదకవర్గానికి అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజాశక్తి సమస్య వార్తలకు మరింత పదును పెట్టాలని ఆకాంక్షించారు. ఆలూరు విలేకరి కృష్ణ, చిప్పగిరి విలేకరి రవి యాదవ్ పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కెల పరిశీలన

ప్రజాశక్తి - గోనెగండ్ల

రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు

మండలంలోని హెచ్ కైరవాడి, పుట్టపాశం రైతు సేవా కేంద్రాలను తహశీల్దార్ పి.రాజేశ్వరి ఎఓ హేమలతతో కలిసి పరిశీలించారు. కైరవాడి సింగిల్ విండో ప్రెసిడెంట్ తిమ్మారెడ్డితో పాటు అధికారులు రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. మండలంలో రైతులకు యూరియా కొరతతో పాటు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఎఓ హేమలత మాట్లాడుతూ... రైతులు నానో యూరియాను కూడా వాడాలని కోరారు. దీని వల్ల నత్రజని ఎరువుల వినియోగం పెరిగి నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని తెలిపారు. సొసైటీ సిఇఒ ప్రకాష్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు రాంగోపాల్, రఘునాథ్ యాదవ్ పాల్గొన్నారు.

'రోడ్లు, డ్రైయినేజీ సౌకర్యం కల్పించాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పట్టణంలోని శివన్న నగర్ ప్రాంతంలో రోడ్లు, డ్రైయినేజీ సౌకర్యం కల్పించాలని సిపిఎం పట్టణ నాయకులు బి.రాముడు, కె.కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం శివన్న నగర్‌లో వర్షంతో నీరు చేరిన కుటుంబాలను పరామర్శించి కాలనీ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ... శివన్న నగర్ ప్రాంతంలో చేనేత కార్మికులు మగ్గంపైనే జీవనం సాగిస్తున్నారని, మగ్గాల లోపలికి బయట వర్షపు నీరాయని తెలిపారు. రోడ్లు, డ్రైయినేజీలు, వీధిలైట్లు, మౌలిక సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని కోరారు. చేనేత సంఘం నాయకులు నాగరాజు, భాగ్యమ్మ, జయమ్మ, గణేష్ కనికే కృష్ణ, శ్రీనివాసులు, మల్లారెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

కదం తొక్కిన దళితులు

- భారీగా దళితుల ఐక్యత ప్రదర్శన
- అంబేద్కర్ భవనం, జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంబేద్కర్ భవనం, జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలని దళితులు కదం తొక్కారు. సోమవారం పార్టీలకతీతంగా దళిత, బహుజనులు, దళిత ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి ఐక్యత ప్రదర్శన చేపట్టారు. ముందుగా ఎంపిడిఒ కార్యాలయం నుంచి బయల్దేరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సోమప్ప సర్కిల్, వైఎస్ఆర్ సర్కిల్ మీదుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవ సహాయం, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన సాధన కమిటీ ఛైర్మన్ కదిరికోట ఆదెన్న, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి జి.ఆనంద్ చైతన్య మాదిగ, మాల మహానాడు నాయకులు, మాజీ కౌన్సిలర్ కోరిశెట్టి మధుబాబు, బేడబుడగ జంగం హక్కుల పోరాట సమితి నాయకులు సంకుల మహాలింగప్ప మాట్లాడారు. దళితుల కోసం ప్రభుత్వం కేటాయించిన భూమిలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మిగనూరు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం ఆమోదం మేరకు రిక్రియేషన్ క్లబ్ ఎదుట డివైడర్ వద్ద భారత మాజీ ఉప ప్రధాని కీర్తిశేషులు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలని తెలిపారు. అంబేద్కర్ భవనానికి కేటాయించిన స్థలంలో మున్సిపల్ స్థలంగా బోర్డు వేయడం సరికాదన్నారు. జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటుకు మున్సిపల్ తీర్మానం ఆమోదించి కలెక్టర్‌కు పంపి 13 ఏళ్లు గడుస్తున్నా విగ్రహం ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. కలుగొట్ల రోడ్డులో విస్తరించిన జగ్జీవన్ రామ్ కాలనీకి ముఖద్వారం నిర్మాణానికి రూ.5 లక్షలు నిధులు మంజూరు చేస్తూ 2020లో స్పెషల్ ఆఫీసర్ కౌన్సిల్ ఆమోదం తెలిపినా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరిట పట్టణంలో సంజీవయ్య నగరగా నామకరణ చేస్తున్నట్లు బోర్డు ఏర్పాటు చేయలేదని తెలిపారు. దళితుల సమస్యలపై ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం టిడిపి నాయకులు, ఎపిసిసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు మాట్లాడారు. అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధుల కేటాయింపు, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు అంశాలను ఎమ్మెల్యే బీవీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని తన సౌజన్యంతో దాతగా అందజేస్తానని హామీ ఇచ్చారు. దళిత రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆరె కంటి భాస్కర్, ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గంజహళ్లి మహాదేవ్ మాదిగ, మాల మహానాడు నాయకులు ఏం.ఐ.హుసేనప్ప, మాల సత్య, బేడ బుడగ జంగం హక్కుల పోరాట రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రాక్షల దస్తగిరి, రుద్రాక్షల బజారి, పూలే, అంబేద్కర్ ఐడియాలజీ కోఆర్డినేటర్ ఎసి.దేవదానం, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు గుడికల్ బోయ శ్రీనివాసులు, నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా నాయకులు కదిరికోట వెస్లీ సునీల్, అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రాజు, కనకవీడు రాజు, కెవిపిఎస్ నాయకులు సుమాల ఆంథోని, సప్పోగు తిమ్మన్న, సుమాల రాజు, జై భీమ్ మాల రాజా రమేష్ పాల్గొన్నారు.

ప్రదర్శన చేపడుతున్న నాయకులు

ముస్లిం శ్మశాన వాటికలో సమాధులు ధ్వంసం

ప్రజాశక్తి - కోసిగి

సమాధులను ధ్వంసం చేస్తున్న దృశ్యం

మండలంలోని వందగల్లు గ్రామంలో ముస్లిం శ్మశాన వాటికలో కొంతమంది వ్యక్తులు సమాధులను ధ్వంసం చేశారు. స్థానికులు, ముస్లింల వివరాల మేరకు... ఆర్లబండ మఠం వెనకాల కొన్నేళ్లుగా ముస్లిం సమాధులు ఉన్నాయి. గ్రామంలో చనిపోయిన వ్యక్తులకు అక్కడే దహన సంస్కారాలు నిర్వహిస్తారు. ఆర్లబండ మఠానికి సంబంధించి భూమి అవసరమని, మఠం వెనకాలే శ్మశానం ఉండడంతో శ్మశానంలో ఖాళీ ఉన్న స్థలాన్ని మఠంలో జరిగే కార్యక్రమాలకు ఉపయోగించడానికి బాగుంటుందని గ్రామస్తులు, ఓ ముస్లిం వర్గం అనుకున్నారు. వెంటనే మరో ముస్లిం వర్గాన్ని సంప్రదించారు. తాత, ముత్తాతల కాలం నుంచి శ్మశానం ఉందని, ఈ శ్మశానాన్ని వేరే వారికి ఇవ్వడం జరగదని మరో ముస్లిం వర్గం తేల్చి చెప్పింది. మూడేళ్ల నుంచి గ్రామస్తులు, మరో ముస్లిం వర్గానికి పదేపదే ఒత్తిడి చేస్తున్నారు. ఈ శ్మశానం 18 సెంట్లు ఉండగా ఈ స్థలాన్ని వదిలి పెట్టాలని, డబ్బులతో ఒక ఎకరా కొనుగోలు చేసి భూమి ఇస్తామని చెప్పారు. ముస్లింలు ససేమిరా అన్నారు. ఇక చేసేదేమీ లేక గ్రామంలో ఉన్న కొంతమంది వ్యక్తులు ఓ ముస్లిం వర్గం వారి కుటుంబీకులు పాత శ్మశాన వాటికలో ఉన్న సమాధులను ధ్వంసం చేశారు. ఈ విషయం మరో ముస్లిం వర్గానికి తెలియడంతో ఇరువర్గాల మధ్య బాహాబాహి, వాదోపవాదాలు జరిగాయి. ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెంటనే సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి ఇరు వర్గాలను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపడుతున్నారు.

'శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి'

ప్రజాశక్తి- గోనెగండ్ల

గోనెగండ్ల మేజర్ పంచాయతీలో ముస్లింల శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. సోమవారం తహశీల్దార్ పి.రాజేశ్వరికి ముస్లింలు వినతిపత్రం అందజేశారు. గోనెగండ్లలో సుమారు 5 వేల మంది ముస్లిం జనాభా నివసిస్తున్నారని, ముస్లింల పురాతన శ్మశాన వాటిక నిండిపోయిందని తెలిపారు. ఎవరైనా చనిపోతే ఖననం చేసేందుకు ఇబ్బందిగా ఉందని చెప్పారు. అధికారులు గ్రామంలో ప్రభుత్వ భూమి లేదా ఏదైనా ఇతర భూమిని ముస్లింల శ్మశాన వాటికకు కేటాయించాలని కోరారు. ఎస్ఎస్.మాబువలీ, యూనుస్, ఖాజీ–2 జలీల్ పాల్గొన్నారు.

'అంగన్వాడీ'ల నిర్మాణానికి స్థల పరిశీలన

- తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి

మాట్లాడుతున్న తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్

మండలంలోని 16 గ్రామాల్లో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్వాడీ భవనాల సమాచారం తెలుసుకొని, వాటి కోసం గ్రామాల్లో స్థలాలను పరిశీలించాలని రెవెన్యూ కార్యదర్శులకు తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ ఆదేశించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో మాట్లాడారు. అంగన్వాడీ భవనాలు నిర్మాణానికి స్థలాలను చూడాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. సంగాల, నేమకల్లు, తిమ్మాపురం, బంటనహాల్, నంచర్ల గ్రామాల్లో బిల్లులు విడుదల చేయకపోవడంతో అంగన్వాడీ భవన నిర్మాణాలు అర్థాంతరంగా ఆగిపోయాయన్నారు. వాటికి సంబంధించిన పూర్తి సమాచారం ఉన్నతాధికారులకు తెలియజేసి నిర్మాణాలను పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. నిర్మించే వాటికి స్థలాలను పరిశీలించాలని రెవెన్యూ కార్యదర్శులకు ఆదేశాలిచ్చారు. ఆర్ఐ సునీత, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఈరమ్మ, జూనియర్ అసిస్టెంట్ వీరేష్ పాల్గొన్నారు.

తాగునీరు వృథాను అరికట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని గణేకల్లు గ్రామంలో పంచాయతీ మోటార్ నుంచి వచ్చే నీళ్లు వృథా అవుతున్నా పట్టించుకోవడం లేదని, నీటి వృథాను అరికట్టాలని సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, మండల కార్యదర్శి వర్గసభ్యులు వీరారెడ్డి కోరారు. సోమవారం ఎంపిడిఒ జనార్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గణేకల్లు గ్రామంలో పంచాయతీ మోటార్ నుంచి నాలుగు మినీ ట్యాంకులకు నీరందేవని, సిసి రోడ్లు, డ్రైనేజీలు వేసే సందర్భంలో పైపులు పగిలి పోవడం వల్ల రెండు ట్యాంకులకే పరిమితమవుతున్నాయని తెలిపారు. పంచాయతీ మోటార్ కూడా మరమ్మతులకు గురికావడంతో దాదాపు 5 నెలలుగా నీటి సరఫరా ఆగిపోయిందని చెప్పారు. ఎమ్మెల్యే స్పందించి గ్రామాల్లో నీటి సరఫరా సక్రమంగా చేసే విధంగా అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఆదేశాలివ్వాలని తెలిపారు. డివైఎఫ్ఐ నాయకులు చిన్న వీరేష్, రామకృష్ణ, బంగారయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి - మంత్రాలయం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెంది రెండు కుటుంబాల్లో విషాదం నింపారు. ఆదివారం సుజయీంద్ర నగర్ కాలనీకి చెందిన మాబు (24), రాఘవేంద్ర నగర్‌కు చెందిన రాజేష్ (24)లు ద్విచక్ర వాహనంపై ఆదోనికి బయల్దేరారు. రాత్రి బనవాసి సమీపంలో కారును ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక ఇద్దరు మృతి చెందారు. పింజరి ఖాశమ్మ, ఖాసీంల పెద్ద కుమారుడు మాబు చెన్నైలో ఉద్యోగానికి వెళ్తుండగా తనను ఆదోని రైల్వే స్టేషన్‌లో వదలాలని కోరగా లక్ష్మి, రవిల కుమారుడు రాజేష్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఘటన జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివాంజల్ సోమవారం తెలిపారు.

మృతి చెందిన రాజేష్, మాబు

పింఛన్ల తొలగింపును విరమించుకోవాలి

- వికలాంగుల ఆందోళన

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రవ్యాప్తంగా వికలాంగుల పింఛన్ల తొలగింపును ప్రభుత్వం విరమించుకోవాలని వికలాంగులు ఆందోళనకు దిగారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనకు సిపిఎం మద్దతు తెలిపింది. మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వికలాంగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, మల్లయ్య, సిపిఎం నాయకులు పిఎస్.గోపాల్, తిప్పన్న, పట్టణ నాయకులు నాగరాజ్, వీరేష్ మాట్లాడారు. గత ప్రభుత్వం వికలాంగులకు ఫేక్ సర్టిఫికెట్లు ఇచ్చిందని.. సంవత్సరం క్రితం కూటమి ప్రభుత్వం వైద్యులతో వెరిఫికేషన్ చేయించిందని తెలిపారు. మరి ఇప్పుడు కొత్తగా శాతం తక్కువగా ఉందని ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో పింఛను రద్దు చేస్తామని వికలాంగులకు నోటీసులు ఇవ్వడంతో వికలాంగులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. పింఛను పై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పింఛను రద్దు కావడంతో ఆర్థిక ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన వికలాంగులందరికీ పింఛన్లు 1వ తేదీన ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 13లోపు సంబంధిత సచివాలయాల్లో ధ్రువీకరణ పత్రాలు వెల్ఫేర్ సెక్రటరీలకు ఇవ్వాలని కమిషనర్ సూచించారు.

మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న వికలాంగులు

ఆదోనిరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన పింఛన్లను కొనసాగించాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న డిమాండ్ చేశారు. ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మానసిక, శారీరక వికలాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయమని విమర్శించారు. గతంలో సదరం క్యాంపుల ద్వారా పొందిన సర్టిఫికెట్లు 'ఫేక్' అని ఎలా చెబుతారని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం వికలాంగుల పింఛన్లను కొనసాగించాలని, కొత్త వారికి పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ జనార్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. వికలాంగుల సంఘం మండల అధ్యక్షులు హనుమంత రెడ్డి, నాయకులు వీరాంజనేయులు, దుగ్యప్ప, సిఐటియు మండల కార్యదర్శి వీరారెడ్డి, రైతు సంఘం నాయకులు ఉచ్చీరప్ప, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి వీరేష్, డివైఎఫ్ఐ మండల నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

పెద్దహరివాణాన్ని మండలంగా ప్రకటించాలి

- భారీ ఎత్తున బైక్ ర్యాలీ
- కలిసికట్టుగా కదిలిన గ్రామస్తులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని జిల్లాతో పాటు మండలంలో అతిపెద్ద గ్రామమైన పెద్దహరివాణాన్ని మండలంగా ప్రకటించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం సర్పంచి హెచ్.రామన్న, గ్రామ పెద్దలు ఆదినారాయణ రెడ్డి, మెడికల్ నాగరాజ్, ఆదిశేషిరెడ్డి, బిపి.వీరేశప్ప, రిటైర్డ్ ఉపాధ్యాయులు రాము బసవరాజ్, నాగరాజ్, ఈరప్ప, కుప్పలదొడ్డి గర్జప్ప, గురులింగ, బారికి అయ్యప్ప, జాలవాడి రమేష్, ఆర్లబండ రంగస్వామి, యువకులు సున్ను సాబ్, కర్రెప్ప, బాలప్ప, బిపి.బలరాం, రంగారెడ్డి, కొట్టిగి సంతోష, మీసేవ నాగరాజ్, ఢాబా చంద్రారెడ్డి, బండి తిమ్మప్ప, వేమన్న, నర్సారెడ్డి ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ముందుగా గ్రామం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో మహాత్మ గాంధీ విగ్రహానికి, పట్టణంలోని శ్రీనివాస్ భవన్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సబ్ కలెక్టర్ కార్యాలయానికి బయల్దేరారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడారు. ఆదోని మున్సిపాలిటీలో చేరినా నియోజకవర్గంలో ఒకే ఒక్క రెవెన్యూ మండలం ఉండడం అశాస్త్రీయమని, పరిపాలన కుంటు పడడమే కాక అభివృద్ధికి నిధుల కొరత ఏర్పడుతుందని తెలిపారు. విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే పార్థసారథి జిల్లా అధికారులు, సంబంధిత మంత్రుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. అసెంబ్లీలోనూ ఆదోనిని నాలుగు రెవెన్యూ మండలాలుగా ఏర్పాటు చేయాలని కోరినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియ తెరపైకి తెచ్చి మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయ సేకరణకు నడుం బిగించిన నేపథ్యంలో ఆదోని కేంద్రంగా ఆదోని కొత్త జిల్లా, ఆదోని మండలం పునర్విభజనలో అంతర్భాగంగా పెద్ద హరివాణం గ్రామం కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఎంపిడిఒ జనార్ధన్, తహశీల్దార్ రమేష్, ఎంపిపి దానమ్మకు వినతిపత్రం అందజేశారు. సంతేకుడ్లూరు ప్రతాప్ రెడ్డి, చిన్నాహరిహాణం ఎంపిటిసి వీరేశప్ప మద్దతు తెలిపారు. రామన్న, చిన్న రంగస్వామి, గోరవ చిదానంద, బిపి.లింగ, భాస్కర్, అల్లప్ప పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు

బాల్య వివాహాలపై అవగాహన అవసరం

- ఎస్సీ, ఎస్టీ సివిల్ జిల్లా జడ్జి లీలా వెంకట శేషాద్రి

ప్రజాశక్తి - మంత్రాలయం

మాట్లాడుతున్న జడ్జి లీలా వెంకట శేషాద్రి

బాల్య వివాహాల నిరోధక చట్టంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్సీ, ఎస్టీ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి సూచించారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంపు నిర్వహించారు. బాల్య వివాహాలు, చిన్న వయస్సులోనే గర్భధారణ వల్ల కలిగే దుష్ప్రయోజనాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో బాల్య వివాహాలు జరుగుతున్న నేపథ్యంలో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. పంటలు సరిగా పండకపోవడంతో వలసలు వెళ్తున్నారని, ఈ నేపథ్యంలో ఆడపిల్లలను చూసేందుకు ఇబ్బందులు పడుతున్న తరుణంలో చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేస్తున్నారనే సమాచారం ఉందని చెప్పారు. నిబంధనలు అతిక్రమించి బాల్య వివాహాలు చేస్తే రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.రషీద్, న్యాయవాదులు మురళీకృష్ణ, విజయ్ కుమార్, ఏసేపు, సల్మాన్, ఎమ్మిగనూరు లీగల్ సెల్ అథారిటీ క్లర్క్ మహేశ్వరి, మహిళా న్యాయవాది విమల, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ నూర్జహాన్, కర్నూలు మహిళా పోలీస్ స్టేషన్ సిఐ విజయలక్ష్మి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పి.కొండయ్య, సిడిపిఒ రాజేశ్వరి దేవి, ఎమ్మిగనూరు బార్ ప్రెసిడెంట్ రసీదుల్లా, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ రాధిక, అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ రఘురామిరెడ్డి, జిల్లా మెడికల్ హాస్పిటల్ సైకియాట్రిస్ట్ గంగాధర్ నాయక్, మంత్రాలయం సిఐ రామాంజులు, జిల్లా ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ రాజేశ్వరి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద పాల్గొన్నారు.

రేషన్ బియ్యం రవాణాపై తప్పుడు ప్రచారం

- డీలర్ బారిక నాగలక్ష్మి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని మాలపల్లి గ్రామంలో పొదుపు సంఘం ద్వారా నడుపుతున్న డీలర్ షాపు నుంచి 30 క్వింటాళ్ల బియ్యం బస్తాల అక్రమ రవాణాను అడ్డుకున్నట్టు టిడిపి నాయకులు, కలుదేవకుంట సొసైటీ డైరెక్టర్ లక్ష్మన్న చేసిన ఆరోపణలో నిజం లేదని, తప్పుడు ప్రచారమని డీలర్ బారిక నాగలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బియ్యం అక్రమ రవాణాపై సిఎస్‌డిటి చంద్రకళ, ఆర్ఐ జనార్ధన్ రావు, విఆర్ఒ ప్రభాకర్ విచారణ చేపట్టారు. స్టాక్ వివరాలు సక్రమంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. డీలర్ నాగలక్ష్మి మాట్లాడుతూ... ఇప్పటికే ఆరుసార్లు తనపై బియ్యం అక్రమ రవాణా చేశారని ఆరోపించారని, ఇది 7వ సారి అని తెలిపారు. లక్ష్మన్న తప్పుడు ఫిర్యాదుతో రెవెన్యూ, పోలీసు అధికారులను తప్పుదోవ పట్టించారని చెప్పారు. తమ బావలకు చెందిన క్వింటా బియ్యాన్ని ఆటోడ్రైవర్‌కు కిలో రూ.10 చొప్పున అమ్మగా వాటిని తరలిస్తుండగా లక్ష్మన్న ఏకంగా 10 క్వింటాళ్ల బియ్యం తీసుకెళ్తున్నారని అని తనపై ఆరోపణలు చేశారని తెలిపారు. రెవెన్యూ అధికారులు రికార్డులు తనిఖీ చేసి తమ రేషన్ షాపులో సరుకు తప్పుదోవ పట్టలేదని ధ్రువీకరించారని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న బారిక నాగలక్ష్మి

వైద్యులపై చర్యలు చేపట్టాలి

- వైసిపి నాయకులు గడ్డం నారాయణరెడ్డి

ప్రజాశక్తి - నందవరం

వికలాంగుల పింఛన్లపై తప్పుడు ధ్రువీకరణ పత్రాలిచ్చిన వైద్యులపై చర్యలు చేపట్టాలని వైసిపి నాయకులు గడ్డం నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన వికలాంగులకు మద్దతుగా నందవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కేశవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 165 పింఛన్లను అక్రమంగా తొలగించారని తెలిపారు. అందులో దాదాపు 20 ఏళ్ల నుంచి పింఛను పొందుతున్న వారు ఉన్నారని చెప్పారు. అప్పటి వైద్యులు కొంతమందికి వంద శాతం, మరి కొంతమందికి 80 శాతం అంగవైక్యలం ఉందని సర్టిఫికెట్లు జారీ చేశారని తెలిపారు. అప్పుడు జారీ చేసిన సర్టిఫికెట్లు తప్పంటూ.. ప్రస్తుత వైద్యులు వారికి 40 శాతంలోపు అంగవైకల్యం ఉందంటూ సర్టిఫికెట్లు జారీ చేయడం ఆశ్చర్యకర మైన విషయమని ఎద్దేవా చేశారు. తప్పుడు పత్రాలిచ్చి వికలాంగుల జీవితాలతో వైద్యులు ఆడుకుంటున్నారని మండిపడ్డా రు. సర్టిఫికెట్లు మంజూ రు చేసిన అప్పటి వైద్యులపైనా, ఇప్పటి వైద్యులపైనా విచారణ చేపట్టి అవినీతికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గ ప్రచార విభాగ అధ్యక్షులు చాంద్ బాషా, మండల కార్యదర్శి బోయ వెంక టేష్, వైసిపి విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇబ్రహీంపురం ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తున్న నాయకులు

శ్మశాన వాటిక రోడ్డును బాగు చేయండి

- జనసేన నాయకులు

వినతి పత్రం అందిస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండలోని ఎస్సీ కాలనీ నుంచి వెళ్లే శ్మశాన వాటిక మట్టి రహదారి అభివృద్ధి చేయాలని జనసేన పార్టీ మండల నాయకులు ఉచ్చీరప్ప, రామాంజనేయులు, బంగి బాలకృష్ణ, ఈశ్వర్ కోరారు. సోమవారం ఎంపిడిఒ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శ్మశాన వాటిక మీదుగా కొత్తపేట స్టేజీ వరకు వెళ్లే మట్టి రహదారికిరువైపులా ముళ్లకంపలు పెరగడంతో అటువైపు పొలాలకు వెళ్లే రైతులు, మృతదేహాలను తీసుకెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. గుంతలు ఏర్పడి ఉండడంతో రైతుల ఎద్దుల బండ్లు వంకలో కిందపడి బండ్లు విరిగి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని చెప్పారు. గ్రామంలోని 50 శాతం రైతులు పొలాలకు టర్నింగ్ నుంచి 3 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్తున్నారని, ఈ రోడ్డు వేయకపోవడం వల్ల చాలామంది రైతులు రాత్రిపూట రోడ్డుపై వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. రహదారి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

'సూపర్ సిక్స్' విజయవంతం

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్రరెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సక్సెస్ అని టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక తేరు బజార్ ఆవరణలో టిడిపి మండల కన్వీనర్ జ్ఞానేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వమంటేనే సంక్షేమం, అభివృద్ధికి మారుపేరని తెలిపారు. ముందుగా ఎన్‌టిఆర్, ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. టిడిపి నాయకులు ముత్తు రెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాఘవేంద్ర రెడ్డి

మహారాజశ్రీ గౌరవనీయులైన 2వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, ఆదోని

E.P. No.180 of 2024 in A.A. No.373/2019

Between:-
M/S Shriram Finance limited.,
Rep. by its GPA Holder Sri. M.Sanjanna.
...Decree Holder

Versus

Jdr No.1: Khalandar S/o Abdul Jabbar, H No:6-293, Telewadi Street, Adoni Town, Kurnool, (Dt), A.P. ...Judgment Debtors

1 వ ప్రతివాదులకు ఆర్డర్ 21 రూల్ 22 సి.పి.సి. నోటీసు :

పై నంబర్ అమలు అర్జీ (E.P.) లో వాది Dhr. అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 1వ ప్రతివాదులైన (JDr.1) మీ పైనా ఆర్బిట్రేషన్ అవార్డును పొంది అవార్డు అమలు చేయమని కోరుతూ అమలు అర్జీ (E.P.) దాఖలు చేసి ఉన్నారు. పై అమలు అర్జీ నందు కోర్టువారు మీకు మీరున్న అడ్రసుకు order 21, Rule.22, నోటీసులు ఎన్నిసార్లు పంపించిన ఉద్దేశపూర్వకంగా తీసుకోకుండా తిప్పి వెనుకకు పంపుతూ ఉన్నారు. కావునా పై అమలు అర్జీ నందు మీకు ఏమైనా ఆక్షేపనలు వున్న ఎడల పై కోర్ట్ వారి యెదుట 29-08-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు ఆదోని కోర్టు నందు హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకోవలెను. లేని యెడల పై అమలు అర్జీ మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 29.08.2025

Sri. B.Veeresh
Sri. G.Uday Kumar Yadav
Dhr తరపు న్యాయవాదులు, ఆదోని.

మహారాజశ్రీ గౌరవనీయులైన 2వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, ఆదోని

E.P. No.239 of 2024 in A.A. No.152/2019

Between:-
M/S Shriram Finance limited.,
Rep. by its GPA Holder Sri. M.Sanjanna.
...Decree Holder

Versus

Vadde Raju & Other

Jdr No.1: Vadde Raju S/o V.Savaraiah, H No:21/499/97, Karvan pet Street, Adoni Town, Kurnool, (Dt), A.P. ...Judgment Debtors

1 వ ప్రతివాదులకు ఆర్డర్ 21 రూల్ 22 సి.పి.సి. నోటీసు :

పై నంబర్ అమలు అర్జీ (E.P.) లో వాది Dhr. అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 1వ ప్రతివాదులైన (JDr.1) మీ పైనా ఆర్బిట్రేషన్ అవార్డును పొంది అవార్డు అమలు చేయమని కోరుతూ అమలు అర్జీ (E.P.) దాఖలు చేసి ఉన్నారు. పై అమలు అర్జీ నందు కోర్టువారు మీకు మీరున్న అడ్రసుకు order 21, Rule.22, నోటీసులు ఎన్నిసార్లు పంపించిన ఉద్దేశపూర్వకంగా తీసుకోకుండా తిప్పి వెనుకకు పంపుతూ ఉన్నారు. కావునా పై అమలు అర్జీ నందు మీకు ఏమైనా ఆక్షేపనలు వున్న ఎడల పై కోర్ట్ వారి యెదుట 29-08-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు ఆదోని కోర్టు నందు హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకోవలెను. లేని యెడల పై అమలు అర్జీ మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 29.08.2025

Sri. B.Veeresh
Sri. G Uday Kumar Yadav
Dhr తరపు న్యాయవాదులు, ఆదోని.

మహారాజశ్రీ గౌరవనీయులైన 2వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, ఆదోని

E.P. No.153 of 2024 in A.A. No.1456/2016

Between:-
M/S Shriram Transport Finance Co. limited.,
Rep. by its GPA Holder Sri. G Murali.
...Decree Holder

Versus

S. Jabbar Sab and Other. ...Judgment Debtors

Jdr No.2: Thimmappa N S/o Urukundappa, H No:1-2334, Nehru Nagar, Near Lakshman Theater, Yemmiganur Town, Kurnool, (Dt), A.P. ...Judgment Debtors

2 వ ప్రతివాదులకు ఆర్డర్ 21 రూల్ 37 సి.పి.సి. నోటీసు :

పై నంబర్ అమలు అర్జీ (E.P.) లో వాది Dhr. అయిన శ్రీరామ్ ట్రాన్స్పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ వారు 2వ ప్రతివాదులైన (JDr.2) మీ పైనా ఆర్బిట్రేషన్ అవార్డును పొంది అవార్డు అమలు చేయమని కోరుతూ అమలు అర్జీ (E.P.) దాఖలు చేసి ఉన్నారు. పై అమలు అర్జీ నందు కోర్టువారు మీకు మీరున్న అడ్రసుకు order 21, Rule.37, నోటీసులు ఎన్నిసార్లు పంపించిన ఉద్దేశపూర్వకంగా తీసుకోకుండా తిప్పి వెనుకకు పంపుతూ ఉన్నారు. కావునా పై అమలు అర్జీ నందు మీకు ఏమైనా ఆక్షేపనలు వున్న ఎడల పై కోర్ట్ వారి యెదుట 29-08-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు ఆదోని కోర్టు నందు హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకోవలెను. లేని యెడల పై అమలు అర్జీ మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 29.08.2025

Sri. A MD Latheef Ahmed,
Sri. G.Uday Kumar Yadav
Dhr తరపు న్యాయవాదులు, ఆదోని.

మహారాజశ్రీ గౌరవనీయులైన 2వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, ఆదోని

E.P. No.21 of 2023 in A.A. No.774/2019

Between:-
M/S Shriram Transport Finance Co. limited.,
Rep. by its GPA Holder Sri. G Murali.
...Decree Holder

Versus

Jdr No.1: U Viswanath S/o U Veeranna, H No:1-116, B C Colony, Yatakallu Village, Aspari Mandal, Kurnool, (Dt), A.P.
Jdr No.2: Madar Sab P S/o Rasool, H No:5-7A, Inakallu Village, Aspari Mandal, Kurnool, (Dt), A.P. ...Judgment Debtors

1, 2 వ ప్రతివాదులకు ఆర్డర్ 21 రూల్ 22 సి.పి.సి. నోటీసు :

పై నంబర్ అమలు అర్జీ (E.P.) లో వాది Dhr. అయిన శ్రీరామ్ ట్రాన్స్పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ వారు 1, 2 వ ప్రతివాదులైన (JDr.1 &2) మీ పైనా ఆర్బిట్రేషన్ అవార్డును పొంది అవార్డు అమలు చేయమని కోరుతూ అమలు అర్జీ (E.P.) దాఖలు చేసి ఉన్నారు. పై అమలు అర్జీ నందు కోర్టువారు మీకు మీరున్న అడ్రసుకు order 21, Rule.22, నోటీసులు ఎన్నిసార్లు పంపించిన ఉద్దేశపూర్వకంగా తీసుకోకుండా తిప్పి వెనుకకు పంపుతూ ఉన్నారు. కావునా పై అమలు అర్జీ నందు మీకు ఏమైనా ఆక్షేపనలు వున్న ఎడల పై కోర్ట్ వారి యెదుట 29-08-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు ఆదోని కోర్టు నందు హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకోవలెను. లేని యెడల పై అమలు అర్జీ మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 29.08.2025

Sri. M Janardhan
Sri. G.Uday Kumar Yadav
Dhr తరపు న్యాయవాదులు, ఆదోని.

ఆదోని మార్కెట్ యార్డుకు వచ్చిన వేరుశనగ

నిలిచిన వేరుశనగ కొనుగోళ్లు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ కొనుగోళ్లు నిలిచిపోయాయి. సోమవారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 10 వేల బస్తాలు అమ్మకానికి వచ్చాయి. మార్కెట్ యార్డులో నేటి నుంచి పాసింగ్ విధానాన్ని అధికారులు ఎత్తివేయడంతో వ్యాపారులు టెండర్లు వేసేందుకు ముందుకు రాలేదు. రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో మార్కెట్ యార్డు అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. తదుపరి చర్యల కోసం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌తో మార్కెట్ యార్డు అధికారులు సమావేశమయ్యారు. మరోవైపు ఆకాశం మేఘావృతం కావడంతో వేరుశనగ ఎక్కడ తడిసిపోతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కబ్జాకు యత్నించే వారిపై చర్యలు తీసుకోవాలి : సర్పంచి

పొట్లపాడులోని ప్రభుత్వ స్థలం

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని పొట్లపాడు గ్రామంలో ప్రభుత్వ స్థలం కబ్జాకు ప్రయత్నించే వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచి సోమశేఖర్ రెడ్డి, గ్రామస్తులు కేశన్న, ఆనంద్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలోని సర్వే నెంబర్ 99లో రైతు భరోసా, హెల్త్ సెంటర్, సచివాలయ నిర్మాణాలకు గతంలో పని చేసిన తహశీల్దార్ స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. రైతు భరోసా కేంద్రం మాత్రం పూర్తయిందని, మిగిలిన వాటికి నిధులు మంజూరు కాకపోవడంతో నిర్మాణాలు ఆగిపోయాయని చెప్పారు. గ్రామానికి చెందిన అశోక్ పత్తికొండ ఎన్ఆర్ఈజిఎస్ అవుట్‌సోర్సింగ్ కింద టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఖాళీగా ఉన్న 12 సెంట్ల స్థలానికి దొంగ పట్టాలు పుట్టించి కబ్జా చేసేందుకు ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాకుండా సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నకిలీ ఎరువులను అమ్మితే చర్యలు

- ఎస్ఐ శ్రీనివాసులు, ఎఒ శ్రీరామ్ ప్రవీణ్

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలో ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ ఎరువులు, నకిలీ నీటి మందులు అమ్మారని తెలిస్తే షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు, ఎఒ శ్రీరామ్ ప్రవీణ్ హెచ్చరించారు. సోమవారం బెల్దోన గ్రామంలో ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులను మభ్యపెట్టి రసీదులు ఇవ్వకుండా ఉండడం కూడా నేరమని, రైతులు వీటిపై ఫిర్యాదులు చేస్తే శాఖపర్యవైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్ లేని ఫర్టిలైజర్ షాపులున్నట్లు తమ దృష్టికి తెస్తే వాటిపై పూర్తి సమాచారం తెలుసుకుని షాపులను బంద్ చేయిస్తామన్నారు. ట్రెయినీ ఎస్ఐ రాజు కుళ్లాయప్ప పాల్గొన్నారు.

బెల్దోనలో ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ, ఎఒ

సివిల్ కానిస్టేబుల్ అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల నియామక ప్రక్రియలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో ధ్రువీకరణ పత్రాల పరిశీలించామని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సోమవారం తెలిపారు. ఈ పరిశీలనకు మొత్తం 309 మంది సివిల్ కానిస్టేబుల్ అభ్యర్థులకు గాను 297 మంది హాజరయ్యారన్నారు. అభ్యర్థుల విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రం, స్థానికత సర్టిఫికేట్, స్పెషల్ కేటగిరి సర్టిఫికేట్ ఇతర అవసరమైన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, అభ్యర్థుల వద్ద నుండి 3 సెట్ల అటెస్టేషన్ పత్రాలను తీసుకున్నామన్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నారని ఎస్‌పి తెలిపారు. అభ్యర్థులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలన్నింటినీ సమగ్రంగా పరిశీలిస్తున్నారన్నారు. పత్రాల పరిశీలన అనంతరం అర్హత కలిగిన అభ్యర్థులను తదుపరి నియామక దశకు ఎంపిక చేస్తారన్నారు. అభ్యర్థులు తమ పత్రాలను సమర్పించడానికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే అక్కడికక్కడే నివృత్తి చేశామన్నారు. ఈనెల 26న 334 మంది ఎపిఎస్‌పి కానిస్టేబుల్ అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందన్నారు. సివిల్ కానిస్టేబుళ్ల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ఈ రోజు హాజరు కాని మిగిలిన 12 మంది అభ్యర్థులకు,

ఎపిఎస్‌పి అభ్యర్థులతో పాటు రేపు మాత్రమే అవకాశం కల్పించామని తెలిపారు. అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్ , ఎఆర్ డిఎస్‌పి భాస్కర్‌రావు, పిడిఒ ఎఒ ఎస్ .విజయలక్ష్మి, ఆర్ఐలు , సూపరింటెండెంట్లు, డిపిఒ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూల్ నగరంలో 12వ వార్డు వడ్డే గేరి ప్రాంతంలో డబ్రాగుంతలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని సిపిఎం నాయకులు అబ్దుల్ దేశాయ్ డిమాండ్ చేశారు. సిపిఎం నగర నాయకులు చాంద్‌బాషా ,ఎస్ఎండి మూస, వేణు, సిద్దయ్య, దేవస్వామి, తదితరులు కలిసి మునిసిపల్ ఆఫీసు అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణను సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం ఇచ్చారు. 12వ వార్డ్ వడ్డెగేరిప్రాంతంలో డబ్‌రా గుంతల్లో మున్సిపల్ అధికారులు కాంట్రాక్ట్ కలసి మధ్యలోనే పని ఆపేశారని, ఇప్పటికి నాలుగు నెలలు అవుతుందన్నారు. సిపిఎం నాయకులు చాలా సందర్భాల్లో పర్యటించి మీడియా దృష్టికి తెచ్చామన్నారు. నెలరోజుల క్రితమే మున్సిపల్ కమిషనర్ విశ్వనాథకు అర్జీ ఇచ్చామన్నారు. వెంటనే కమిషనర్ ఇంజనీరింగ్ సెక్షన్ డిఇ కృష్ణ లతకు ఆదేశాలు ఇచ్చారన్నారు. మేడం మూడు రోజుల్లో పని పూర్తి చేస్తామనిచెప్పారని, కమిషనర్ కూడా వడ్డే గేరిప్రాంతంలో వచ్చి చూశారన్నారు. రేపటి నుంచి పనులు మొదలు పెడతామని చెప్పారన్నారు. ఇప్పటికీ నెల

అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయులు అబ్దుల్ దేశాయి తదితరులు

అయినా పనులు పూర్తి కాలేదన్నారు. ఇప్పటికైనా వెంటనే పరిష్కరించాలన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించపోతే వడ్డగేరి, బాపూజీ నగర్ ప్రజలను సమీకరించి మున్సిపల్ ఆఫీస్ ముట్టడిస్తామన్నారు. సిపిఎం నాయకులు పుష్ప ,జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నన్నూరు గ్రామంలో ఎస్‌సిల భూములను అన్యక్రాంతం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న రాష్ట్ర సంఘం మండల కార్యదర్శి ఎస్.మధుసూదన్ డిమాండ్ చేశారు. సోమవారం ఓర్వకల్లు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ విద్యాసాగర్‌ను నిరుపేద ఎస్‌సిలతో కలిసి వినతిపత్రం సమర్పించారు. బి.నాగన్న ఎస్ మధుసూదన్ మాట్లాడుతూ నన్నూరు గ్రామంలోని 1292 సర్వే నెంబర్లో 70 సంవత్సరాలుగా ఎస్‌పి భూములు సాగు చేసుకుంటూ జీవనం పొందుతున్నారన్నారు. ఆ భూములకు 2008వ సంవత్సరంలో ప్రభుత్వం వారిని పేదలుగా గుర్తించి పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేసిందన్నారు. ఆ భూముల్లో సాగుచేసిన కంది పంటను రెండుసార్లు ట్రాక్టర్లతో జెసిబిలతో నాశనం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ భూములను అగటు లక్ష్మీదేవి కి 1.63 సెంట్లు, ఆగటు శంకరమ్మకు 1.43 సెంట్లు, బొల్లవరం బాలమ్మకు 3.30 సెంట్లు చెందినదని పేర్కొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపుతున్న వ్యకాసం నాయకులు, బాధితులు

ఈ భూములపై కొంతమంది భూకబ్జాదారుల కన్ను పడిందన్నారు. ఈ భూములు కబ్జా కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివకుమార్ , రామచంద్రుడు, వంశీ, గిరిబాబు, బాధిత రైతులు పాల్గొన్నారు

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 24 అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా, ప్రతిరోజూ ప్రజల నుండి వచ్చే సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుండి మొత్తం 24 అర్జీలు స్వీకరించారు. ఈ ఫిర్యాదులన్నింటినీ నిర్దేశిత గడువులోపు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మంజూర్ బాష, స్వర్ణలత, టిడ్కో అధికారి పెంచలయ్య, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై పర్యవేక్షణ మరింత అవసరం

నగరంలోని అన్ని శానిటేషన్ డివిజన్ల పరిధిలో పారిశుధ్య తనిఖీదారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ మరింత అవసరమని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. సోమవారం ఆయన వెంకటరమణ కాలనీ, బాలాజీనగర్, రామలింగేశ్వర నగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానికులను కలుసుకుని, పారిశుధ్య సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య తనిఖీదారులు నిత్యం క్షేత్రస్థాయిలో స్వచ్ఛత పనులను పర్యవేక్షించాలని, సమస్యలు వచ్చాక స్పందించడం కాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత విభాగాల అధికారులతో సమన్వయం చేసుకొని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. రహదారులకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించాలని, డ్రైనేజీ కాలువలను ప్రతివారం శుభ్రం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుధ్య పర్యవేక్షక అధికారినాగరాజు, తనిఖీదారులు మునిస్వామి, రాజు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ విశ్వనాథ

28నుండి డిఎస్‌సి సర్టిఫికెట్ల పరిశీలన

పరిశీలన కేంద్రంలో కలెక్టర్ పర్యవేక్షణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

డిఎస్‌సి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఎంపికైన అభ్యర్థులకు సోమవారం నుండి నిర్వహించాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ వాయిదా పడింది. ఈనెల 28న బుధవారం నుండి అభ్యర్థుల సర్టిఫికెట్ పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా నన్నూరు టోల్ ప్లాజా వద్ద శ్రీనివాస బిఎడ్ కాలేజీ, రాఘవేంద్ర బిఎడ్ కాలేజీలో మెగా డిఎస్‌సి 2025 అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు సంబంధించి చేసిన ఏర్పాట్లను పర్యవేక్షణ చేశారు. ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన నియామక ఉత్తర్వులను వారి వ్యక్తిగత లాగిన్‌లలో పొందుపరిచారు. అక్కడే ధ్రువీకరణ పత్రాలను కూడా అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు.

నేత్రదాన పక్షోక్షవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల నేపథ్యంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పక్షోత్సవాల ముఖ్య ఉద్దేశం ప్రజల్లో నేత్రదానంపై అవగాహన కల్పించడమన్నారు. పాఠశాలలు,కళాశాలలో విద్యార్థుల అవగాహన కోసం నేత్రదానం చేయండి మరో ఇద్దరికి చూపు లేని వారికిచూపు ప్రసాదించండి అని పిలుపునిచ్చారు. నేత్రదానాన్ని పవిత్రమైన బాధ్యతగా పాటిద్దాం అన్నారు. మరణించిన వ్యక్తి సమాచారాన్ని ఆరు గంటల లోపల సమీపంలోని కంటి సేకరణ కేంద్రానికి ఇస్తే వైద్య సిబ్బంది వచ్చి నేత్రాలను సేకరిస్తారని తెలిపారు. ప్రజల మూఢనమ్మకాలు వదిలి నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నేత్రదానం అన్ని దానాల్లోకి గొప్పదని, చనిపోతూ కూడా నేత్రదానం చేసి చిరంజీవులు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి సిఎస్ఆర్ఎంఒ, డాక్టర్ వెంకటరమణ, అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ శివబాల, ట్రాన్స్‌ప్లాంట్ కోఆరినేటర్స్, సంపత్, ఆర్షద్‌బాష , కార్నియా రికవరీ టెక్నీషియన్స్, గంగాధర్, జి.నరేష్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్యులు

ఉల్లి కు గిట్టుబాటు ధర కల్పించాలి: కాంగ్రెస్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉల్లి పంటకుగిట్టుబాటు ధర కల్పించాలని కర్నూలు సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్‌జిలాని బాషా డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డును కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బృందం పరిశీలన చేసింది.జిలాని బాసా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 18 నెలలు అవుతుందని రైతులకు ఎలాంటి గిట్టుబాటు ధర కల్పించకపోవడం దురదృష్టకరమన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్నారని ఉల్లి రైతులకు క్వింటాలుకు రూ.400 అంటున్నారని, కనీసం రూ.రెండు వేల మద్దతు ధర కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రిపాషా, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, కాంగ్రెస్ ఓబిసి సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి ధరలను తెలుసుకుంటున్న కాంగ్రెస్ నాయకుడు జిలానీ బాషా

విచారించి న్యాయం చేస్తాం

- ఎస్‌పి గ్రీవెన్స్‌కు 96 ఫిర్యాదులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అందిన ఫిర్యాదులపై చట్టపరంగా విచారించి న్యాయం చేస్తామని జిల్లాఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. కర్నూలు ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 96 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

సూపర్‌సిక్స్ విజయవంతం

కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి- కోడుమూరు

కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో సోమవారం కూటమి ప్రభుత్వం ఈ సంవత్సర కాలంలో సూపర్‌సిక్స్ హామీలు అమల చేస్తున్న సందర్భంగా కోడుమూరు పట్టణంలో పెద్ద ఎత్తున మహిళలతో , స్థానిక ప్రజలతో నిర్వహించిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మహిళలతో కలిసి కూటమి ప్రభుత్వం నాయకుల చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు మహిళ సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా కోడుమూరు పట్టణ ప్రజలు చాలా కాలంగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి డి.విష్ణువర్ధన్‌రెడ్డి కలసి సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని కల్లుబావి పురపాలక ఉన్నత పాఠశాలకు ఐడిబిఐ బ్యాంకు అధికారులు రూ.1.50 లక్షల విలువ చేసే కంప్యూటర్లు, ప్రింటర్లు, బీరువా ఇతర సామగ్రిని సోమవారం విరాళంగా అందజేశారు. కర్నూలు బ్రాంచి మేనేజర్ నవీన్ కుమార్, ఆదోని బ్రాంచి మేనేజర్ రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ... ఖాతాదారుల సేవతో పాటు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సామాజిక సేవలోను తాము ముందుంటామని, విద్యార్థుల భవిష్యత్తుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు గిరిబాబు, యుపి ప్రధానోపాధ్యాయులు గంగా నాయక్ వారిని పూలమాల, శాలువాతో సన్మానించారు. బ్యాంకు అధికారులు రాకేష్, రఘు, ఉపాధ్యాయులు శివకుమారి, కాంతమ్మ, పద్మావతి, సాల్మన్, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

కంప్యూటర్లను అందజేస్తున్న బ్యాంకు అధికారులు

ఆదోని (రూరల్) పట్టణంలోని హనుమాన్ నగర్ కిల్చిన్ పేట్ మున్సిపల్ హైస్కూల్‌కు శ్రీమహాయోగి లక్ష్మమ్మ కోఆపరేటివ్ బ్యాంకు తరపున రూ.60 వేల విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్‌ను బ్యాంకు ఛైర్మన్ రాయచోటి సుబ్బయ్య, వైస్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ శెట్టిలు ప్రధానోపాధ్యాయులు ఉరుకుందప్పకు అందజేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అవ్వ బ్యాంకు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఉపాధ్యాయులు ఈశ్వర్, వీరచంద్ర యాదవ్, శ్రీనివాసులు, డైరెక్టర్లు హుస్సేన్ అహ్మద్, శ్రీనివాసులు, విరుపాక్షి రెడ్డి, బ్యాంకు మేనేజర్ ఎమ్ఎమ్‌డి.జుల్‌ఫిఖర్, ఉపాధ్యాయులు చంద్రకళ, మేరీ పాల్గొన్నారు.

కంప్యూటర్ అందజేసిన అవ్వ బ్యాంకు బృందం

వినతులను పరిష్కరించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టంలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తిపరచాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పిజిఆర్ఎస్‌లో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, శ్రీనివాసరాజు, డిఎల్‌పిఒ తిమ్మక్క, ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మనాభ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్, డిప్యూటీ డిఇఒ వెంకటరమణా రెడ్డి, ఆర్‌టిఒ కార్యాలయపు పరిపాలన అధికారి రమాదేవి, డిప్యూటీ తహశీల్దార్ బాబు, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ రుద్ర గౌడ్ పాల్గొన్నారు.

పదిమంది ఎస్ఐలకు బదిలీ

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

నంద్యాల జిల్లా పరిధిలో పదిమంది ఎస్ఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. జూపాడుబంగ్లా పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ లక్ష్మీనారాయణ ను నంద్యాల సిసిఎస్ బదిలీ చేస్తూ కర్నూల్ డిటిసికి అటాచ్ చేశారు. నంద్యాల జిల్లా విఆర్‌లో ఉన్న మరో తొమ్మిది మంది ఆర్‌పి ఎస్ఐలను పలుచోట్లకు బదిలీ చేశారు. ఇందులో కె.నరేంద్రను ముచ్చుమర్రికి, కే మల్లికార్జున జూపాడుబంగ్లాకు, వై.రామకష్ణారెడ్డిని నంద్యాల సిసిఎస్‌కు బదిలీ చేస్తూ డోన్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు అటాచ్ చేశారు.కె.కృష్ణారెడ్డిని నంద్యాల టూ టౌన్ అర్బన్ పిఎస్‌కు, కె.సంపత్ కుమార్‌ను నంద్యాల పిసిఆర్‌కు, బి.రామాంజనేయులు, నంద్యాల సిసిఎస్‌కు, ఇ.శ్రీనాథ్ గౌడ్ ను మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఆళ్లగడ్డ టౌన్ యుపిఎస్‌కు అటాచ్ చేశారు. ఎ.ఓబులేష్‌ను, ఎస్.లోకనాథ్‌ను నంద్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు సిహెచ్. సాయి బాబా, బాలపీర, సుధాకరప్ప డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను వారు కలిసి వినతి పత్రం సమర్పించారు. కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్మికులు ఏడుగురు, వాటర్ లైన్ మెన్లు, ఐదుగురు అనేక సంవత్సరాల నుండి పనిచేస్తున్నారన్నారు. దాదాపుగా 15 నెలల వరకు పారిశుధ్య కార్మికుల వేతనాలు పెండింగులో ఉన్నాయన్నారు. కార్మికులు తిమ్మప్ప, రాముడు, రంగన్న, ఈమద్దిలేటి, నాగన్న, పెద్ద దీవెన్న, మద్దిలేటి, చిన్నదివన్న పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల్లో దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీలో నాలుగు సంవత్సరాల ఆనర్స్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్ కుమార్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ పరిధిలోని బికాం, కంప్యూటర్స్ బిఎస్‌సి, కంప్యూటర్ సైన్స్, బిఎస్‌సి హార్టికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు పొందెందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నిమజ్జన ఘాట్లను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పత్తికొండ

నిమజ్జన స్థలం చూస్తున్న ఆర్‌డిఒ

పత్తికొండ పట్టణంలోని హంద్రీనీవా ప్రధాన కాలువ దగ్గర వినాయక నిమజ్జన ఘాటు ప్రాంతాన్ని సోమవారం పత్తికొండ ఆర్డిఓ భరత్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ భరత్ నాయక్ మాట్లా డుతూ నిమజ్జన ప్రాంతాలలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ అర్బన్ సీఐ జయన్న, ఆర్ అండ్ బి డిఈ శివ రుద్ర కుమార్,డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు, ఇరిగేషన్ అధికారి వేణుగోపాల్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

అర్హులైన ప్రతి ఒక్కరూ సిఎంసహాయనిధి పథకాన్ని వినియోగించుకోవాలని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు సూచించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు లబ్ధిదారునికి అందజేశారు. కర్నూలు జిల్లా గోనెగండ్లకి చెందిన మూలింటి హంపారెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఎంపీ నాగరాజును సంప్రదించి సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.41,018 మంజూరు అయ్యాయి.. ఈ మేరకు ఎంపీ తన కార్యాలయంలో చెక్కును అందజేశారు.